


## 'శ్రీనివాససేతు'కి జాతీయస్థాయిలో మొదటి అవార్డు

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**




తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన శ్రీనివాససేతు ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ కు జాతీయస్థాయిలో మొదటి స్థానం అవార్డ్ దక్కింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జ ఇంజనీర్స్ వారు ముంబాయిలో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తిరుపతి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీనివాససేతు ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని ప్రశంసిస్తూ మొదటి స్థానం పొందినందుకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్‌కు, ఫ్లై ఓవర్ పనులను చేపట్టిన అప్కాన్స్ ప్రతినిధి రంగస్వామికి అవార్డును అందజేశారు.




# 'ఆశా'లకు కనీస వేతనమివ్వాలని ధర్నాలు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్/సూళ్లూరుపేట/ నాయుడుపేట**

అక్రమంగా అరెస్టు చేసిన ఆశా వర్కర్ల నాయకులను వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనమివ్వాలని డిమాండ్ చేస్తూ గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ నుంచి ప్రదర్శనగా బయల్దేరి ఆర్డీవో ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ అమలు చేయాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ పది లక్షలు ఇవ్వాలని డిమండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, 62కు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, రాజకీయ జోక్యం ఉండరాదని కోరారు. వినతిపత్రాన్ని ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆశా వర్కర్ల అధ్యక్షురాలు పి.చెంగాలమ్మ, కార్యదర్శి కె.జానకి, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.ఉష, జిల్లా సహాయ కార్యదర్శి బి.కృష్ణవేణి, సిఐటియు నాయకులు ఎస్.సురేష్, బివి రమణయ్య, జోగి శివకుమార్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో సిఐటియు కార్యాలయం నుంచి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. గురువారం తలపెట్టిన మహాధర్నా సందర్భంగా ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించి అక్రమ అరెస్టులు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లక్ష్మి, సిఐటియు కార్యదర్శి కె.లక్ష్మయ్య, పి.మనోహర్, కరీంభాయ్ పాల్గొన్నారు.

నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయం ముందు ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. జిల్లా కోశాధికారి సుజాత, అప్పాన, లక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఆశాలపై దౌర్జన్యానికి పాల్పడి నిర్బంధం విధిస్తే ఈ ప్రభుత్వానికి తామేంటో ఎన్నికలపుడు చూపిస్తామన్నారు.

# పేదలకు భూములివ్వాలని సిపిఎం పోరాటం

**ప్రజాశక్తి - ఓజిలి**

సిపిఎం ఆధ్వర్యంలో మాచవరం గ్రామంలో భూ పోరాటం చేశారు. ఓజిలి మండలం మాచవరం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ఆధ్వర్యంలో భూముల్లో జెండాలు పాతి ఆ భూమిలోని తుప్పలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 207 ,208 ,226 లో వందలాది ఎకరాలు మిగులు భూములు ఉన్నాయని 1985 లోనే సుమారు 55 మంది పేదలకు లీజ్ పట్టాలు రెవెన్యూ అధికారులు ఇచ్చారని గుర్తు చేశారు. ఓజిలి మండల కేంద్రంలో వందల ఎకరాలు భూస్వాములు

**వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు**

ఆక్రమించి దర్జాగా కబ్జా చేస్తున్నా రెవిన్యూ యంత్రాంగానికి కనబడలేదా అని ప్రశ్నించారు. పరిశ్రమల పేరుతో పేదలకు భూములు దక్కకుండా అధికార యంత్రాంగం పేద కార్మికులపై దౌర్జన్యాలకు దిగడం సరికాదని తెలిపారు. ఈ సర్వే నంబర్ భూముల్లో సాగు చేయకూడదని చెప్పిన రెవెన్యూ యంత్రాంగం అక్రమంగా గ్రావెల్ తరలిస్తా ఉంటే కళ్ళు మూసుకుని పరిపాలన చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చాపల వెంకటేశ్వర్లు ,శివకవి ముకుంద, గోపాలయ్య ,పద్మమ్మ చెంగయ్య , చంద్రకళ ,మాచవరం పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.


మాచవరం భూపోరాటంలో రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

# గత్యంతరం లేకనే.. గుట్టపై గుడిసెలు..!


రెండు వారాలుగా గుట్టపైనే గుడిసెలు వేసుకుని ఉంటున్న పేదలు

- జానెడు స్థలం కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ
- అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్న జగనన్న పట్టాలు
- ఓపిక నశించి ఉద్యమానికి శ్రీకారం
- గూడు ఇచ్చే వరకూ పోరాటం ఆగదంటున్న పేదలు

**ప్రజాశక్తి - తిరుపతి**

' వారంతా నిరుపేదలు. రెక్కాడితేనే గాని డొక్కాడని బతుకులు. రోజంతా పనిచేస్తేనే ..ఏ పూటకాపూట గడిచేదీ కష్టమే. పారిశుద్ధ్య పనులు, భవన నిర్మాణ పనులు, తాపీ మేస్త్రీలు, ఆటో- జీపు డ్రైవర్లు, వివిధ ఫ్యాక్టరీల్లో వర్కర్లు, బట్టల దుకాణాల్లో కూలీలు, రవాణా రంగంలోని పోర్ట ర్లు, కాంట్రాక్ట్ వర్కర్లు, ఇతర చిన్న చిన్న పనులు చేసుకునే కార్మికులుగా ఉన్న ఈ పేదజీవులంతా కరకంబాడిలో కాపురం ఉంటున్నారు. తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో వేలాది రూపాయల అద్దెల భారాన్ని మోయలేక నగర శివారు ప్రాంతమైన కరకంబాడిలో తక్కువ కిరాయికి జీవనం గడుపుతున్నారు. వీరందరినీ స్థానికులుగా గుర్తించి ప్రభుత్వం ఓటరు కార్డు, రేషన్- ఆధార్ కార్డు, ఇతరత్రా పత్రాలన్నీ ఆ ప్రాంతంలోనే ఇచ్చింది. అయితే ఎన్నికలప్పుడు అభ్యర్థులు, ప్రచార ఆర్భాటాలకు అధికారులు అక్కడికి వచ్చినప్పుడల్లా 'వెంటనే మీకు అందరికీ ఇల్లు ఇచ్చే బాధ్యత మాది ' అంటూ హామీలు గుప్పిస్తూనే ఉన్నారు. ఐదేళ్ల కిందట ప్రతిపక్షంలో ఉన్న జగన్ పాదయాత్రలో కరకంబాడికి వచ్చినప్పుడు పేదల పరిస్థితి చూసి చలించిపోయినట్లు ప్రకటించాడు. తాను సీఎం అయిన వెంటనే మీకందరికీ ఇల్లు ఇస్తానంటూ నమ్మించి ఓట్లను వేయించుకున్నాడు. తీరా ఐదేళు గడిచి మళ్లీ ఎన్నికలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న వేలాది ఎకరాల భూములన్నీ రాజకీయ రాబందుల కబంధహస్తాల్లోకి వెళ్లిపోతోంది. కానీ జానెడు ఇంటి స్థలం కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న పేదలకు మాత్రం నిరాసే ఎదురవుతోంది. దీంతో తమకు గత్యంతరం లేకే గుట్టపైన గుడిసెలు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందంటూ వాపోతుండడం గమనార్హం.

**వేరే గత్యంతరం లేదు : ఎం శ్రీనివాసులు, ఓ ఫ్యాక్టరీ కార్మికుడు**



నేను కరకంబాడిలోనే ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాను. 15 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాను. ఇంటి స్థలం కోసం తిరగని ఆఫీసు, ఇవ్వని అర్జీ లేదు. సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే దాకా అందరి చుట్టూ తిరిగిన నాకు ఇప్పటివరకు ఇంటి స్థలం మంజూరు కాలేదు. ఇక్కడున్న చెట్టు, పుట్ట, కొండ, గుట్టలన్నీ అన్యకాంతమైపోతున్నాయి. చివరికి మాకు గత్యంతరం లేకనే గుట్టపై గుడిసెలు వేసుకున్నాం. అయినా దీన్నీ వదలకూడదని కొందరు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులేమో అలాంటి వాళ్లకే కొమ్ముగాస్తున్నారు.

**ఎన్నాళ్ళు ఎదురు చూడాలి : వెంకటేష్, భవన నిర్మాణ కార్మికుడు**



జానెడు ఇంటి స్థలం కోసం ఎన్నాళ్ళు ఎదురు చూడాలి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా 'ఇదిగో ఇచ్చేస్తున్నాం ..అదిగో ఇవ్వబోతున్నాము ' అంటూ ఏళ్ల తరబడి కాలం వెళ్లదీస్తూనే ఉన్నారు. అయినా మాకు న్యాయం జరగలేదు. జగనన్న నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని బుకాయించాడు. కానీ నేటికీ మాకు ఇంటి స్థలం అందనీ ద్రాక్ష గానే మారింది.

**గుడిసెల జోలికొస్తే ఘోరీ కడతాం: కాంత, నిరుపేద**



కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాజేస్తున్న వారిని కాదని మా గుడిసెలు జోలికొస్తే ఘోరి కడతాం. వీళ్ళ బెదిరింపులకు దౌర్జన్యాలకు భయపడే పరిస్థితిలో మేము లేము. మా కండగా ఎర్ర జెండా ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. మమ్మల్ని ఖాళీ చేయించడంలో అధికారులు చూపుతున్న శ్రద్ధలో కొంచెమైనా మాకు స్థలాలు ఇవ్వడంలో చూపాలి. అలాకాకుండా మమ్మల్ని ఇబ్బందులు పాలు చేయాలని చూస్తే ఏ మాత్రం సహించబోం.




## నేటి నుంచి జిల్లా స్థాయి ఇన్స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

జిల్లా స్థాయి ఇన్స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఆర్పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఆర్ పీ బీ ఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఇన్స్పైర్ మనక్ వైజ్ఞానిక మేళాను జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డీఈవో డాక్టర్ శేఖర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మేళాలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 380 నమూనాలు ప్రదర్శనకు రానున్నట్లు చెప్పారు. ఇందులో 10శాతం ఎగ్జిబిట్స్ ను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్ లో పాల్గొనేందుకు జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చే విద్యార్థులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు డీఎస్వో తెలిపారు. సమావేశంలో సమగ్ర శిక్ష సీఎంవో సురేష్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - శ్రీకాళహస్తి**

ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్యర్యంలో నడుస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాసాగార్డెన్ బాలికల గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు అర్హులైన విద్యార్థినులు ఈనెల 23వ తేదీ లోపు ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ఆ గురుకులం ప్రిన్సిపాల్ ప్రభావతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేయడానికి ఆధార్ కార్డు, కుల ధవీకరణ పత్రం, ఫోన్ నంబర్, రేషన్ కార్డు, విద్యార్థి ఫోటో అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు మార్చి 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి విద్యార్థులకూ, అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

# సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన

**ప్రజాశక్తి - క్యాంపస్**




శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం, విభాగం, టాటా ట్రస్ట్ ఆఫ్ క్యాన్సర్ ఫ్రీ ఇండియా వారి సంయుక్త ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ పై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్. కే. హైమావతి అసోసియేట్ ప్రొఫెసర్ ,కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీ సంధ్య మెడికల్ ఆంకాలజీ స్వీకార్‌టాటా ట్రస్ట్ హాస్పిటల్ తిరుపతి రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు .ఆచార్య డి. భారతి ఉపకులాపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ముఖ్యఅతిథిగా వ్యవహరించారు .డాక్టర్ .పి .వి . హేమంత్ కుమార్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వీకార్ టాటా ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ గౌరవ అతిథిగా వ్యవహరించారు. ఆచార్య డి .భారతి మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యల్లో సర్వైకల్ క్యాన్సర్ ఒకటి అని పేర్కొన్నారు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఆరు మందిలో ఒకరు క్యాన్సర్ బారినపడి మృతి చెందుతున్నారు. 2050 సంవత్సరానికి క్యాన్సర్స్ బారిన పడే మతుల సంఖ్య 77 శాతం పెరుగుతుందని తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ని తొలి దశలోని గుర్తించడం వలన దీనిని పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. డాక్టర్ పివి .హేమంత్ కుమార్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాట్లాడుతూ జిల్లాలో ఎవరికైనా క్యాన్సర్ పై అవగాహన కలిగిస్తూ సర్వేకల్ క్యాన్సర్ అనేది ఉండకుండా అందరూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని ఆశయంతో పని చేస్తున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేస్తామని చెప్పారు.

## 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**




రవాణా రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రమాదకర క్రిమినల్ చట్ట నిబంధనలను రద్దు చేయాలని ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని శుక్రవారం యశోద నగర్ లో సిఐటియు కార్యాలయంలో సదస్సు జరిగింది .ఈ సదస్సుకు సిఐటియు, టి ఎన్ టి యు సి, ఏఐసిసిటియు ,ఏఐటియుసి, ఆర్టీసీ, ఆటో, లారీ, గూడ్స్ వెహికల్స్ కార్మికులతో ఆర్టీసీ యూనియన్ నాయకులు ఈఎస్ కుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి చట్టాలు ఇంకానా అంటూ ఇండియన్ పీనల్ కోడ్ ఎవిడెన్స్ యాక్ట్ క్రిమినల్ ప్రొసీజర్ స్థానంలో మూడు కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. కొత్త చట్టం వల్ల భారతీయ న్యాయ సంహిత 2023 లోని సెక్షన్ 106( 1) ప్రకారం ఐదు సంవత్సరాల దాకా జైలు శిక్ష జరిమానా విధించవచ్చు ఈ సెక్షన్ డ్రైవర్ల పాలిట ఉరితాడు అని డ్రైవర్ల అందరూ గుర్తించడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా అలజడి ప్రారంభమైంది. 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ట్రాన్స్పోర్ట్ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సురేష్, సత్తార్, రత్నకుమార్, వేణుగోపాల్, తంజావూరు మురళి, సుబ్రమణ్యం, పి.బుజ్జి, జి.వాసు, సి.భాస్కర్, డి.రమణయ్య పాల్గొన్నారు.

## భారీ వలలతో మత్స్యసంపద దోపిడీ

**ప్రజాశక్తి - వాకాడు**



మండలంలోని స్వర్ణముఖి బ్యారేజ్ నందు కొంతమంది వ్యాపారులు భారీ వలలతో ఒక్కసారిగా నదిలోని మత్స్య సంపదను దోచేస్తున్నారని నిరుపేద జాలర్లు వాపోతున్నారు. స్వర్ణముఖి నది తీర ప్రాంతంలో ఉన్న కొంతమంది యానాదులు, జాలర్లు రోజు జీవనాధారం కోసం చిన్న చిన్న వలలతో చేపలను వేటాడి జీవనం సాగించేవారు. అయితే బయట ప్రాంతాల నుంచి బడా వ్యాపారులు అక్కడకు వచ్చి దౌర్జన్యంగా వారిని అక్కడి నుంచి తరిమేసి ఒక్కసారిగా సముద్రంలో వేటాడే భారీ వలలతో మొత్తం చేపలను ఒకసారిగా లాగి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో నిరుపేద జాలర్లు జీవనాధారం కోల్పోయారు. ఈ విషయమై ఇరిగేషన్ డిఇ సుబ్బారావును వివరణ కోరగా తన దష్టికి ఇప్పటివరకు రాలేదని, స్వర్ణముఖి నదిలో వలలు పెట్టడానికి ఎవరికీ ఎటువంటి అనుమతి లేదని, అలా కాదని ఎవరైనా వలలు ఉపయోగించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ఎస్పై కు ఫిర్యాదు చేస్తామన్నారు.

## చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పైనా సస్పెన్షన్ వేటు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ గా పనిచేసి ఇటీవల విజయవాడ మెప్మా అసిస్టెంట్ డైరెక్టర్ గా బదిలీ అయిన చంద్రమౌళీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది .తిరుపతి ఉప ఎన్నికల సందర్భంగా 35 వేల దొంగ ఓట్లు నమోదు చేశారని ఆరోపణతో అప్పటి కమిషనర్ గిరీషను ఇటీవలే సస్పెండ్ చేశారు. ఆయనతో పాటు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ గా పనిచేసిన చంద్రమౌళీశ్వర్ రెడ్డి ఉన్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో డాక్టర్ గురుమూర్తి గెలుపు కోసం భారీగా దొంగ ఓట్లు ఎన్నికల లాగిన్ లో నమోదు చేశారని ఆరోపణలు రావడంతో అన్నమయ్య జిల్లా కలెక్టర్గా పని చేస్తున్న గిరిశాను గత నెల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. వీరితోపాటు తాసిల్దారుగా పనిచేసిన జయరామయ్య, ఎన్నికల డిప్యూటీ తాసిల్దారు భాస్కర్ ను సస్పెండ్ చేశారు. తాజాగా చంద్రమౌళీశ్వర్ రెడ్డిని శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రమౌళీశ్వర్ రెడ్డి సస్పెండ్ కానీకుండా అధికార పార్టీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేసినా, కేంద్ర ఎన్నికల అధికారులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేయడంతో రాష్ట్ర ఎన్నికల అధికారులు చంద్రమౌళీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### పెనుబాల పెంచులయ్య విగ్రహావిష్కరణ

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

ప్రముఖ విద్యాదాత డాక్టరు పెనుబాల పెంచులయ్య విగ్రహన్ని మాజీ గవర్నర్ కుమ్మనం రాజశేఖరన్ ఆవిష్కరించారు. స్థానిక దామినేడు సమీపంలోని డాక్టరు పెనుబాల ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్, సైన్స్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టరు పెనుబాల పెంచులయ్య పేద కుటుంబంలో పుట్టి డాక్టరు చదివి, గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించారన్నారు. కోడూరు తదితర ప్రాంతాల్లో ప్రజలకు ఆయన రూపాయి డాక్టరుగా సుపరిచితులన్నారు. పెనుబాల పెంచులయ్య 77వ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అబినందించదగ్గ విషయమన్నారు. పెనుబాల చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యవిద్యలో ప్రతిభ చూపిన వారికి తమ తండ్రిపేరుతో ఎస్వి మెడికల్ కళాశాలలో గోల్డ్‌మెడల్‌లో అందిస్తున్నామని, దీంతో పాటు తమ విద్యా సంస్థల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి తండ్రి పేరుతో పాటు మాజీ ఐఎఎస్ అధికారి సుబ్రమణ్యం, మరో ముగ్గురి పేరుమీద గోల్డ్‌మెడల్స్ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైకం జయచంద్రారెడ్డి, వేణుగోపాల్, పెనుబాల అశోక్‌కుమార్, పెనుబాల హర్షవర్ధన్, పెనుబాల లక్ష్మి, జల్లి మధుసూధన్ పాల్గొన్నారు.




నులిపురుగుల నివారణా మందులు ఇస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## చదువుతో పాటు ఆరోగ్యం అవసరం : కలెక్టర్

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం చాలా అవసరం అని, ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఈరోజు ప్రభుత్వం చేపట్టిన జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీ శ తెలిపారు. శుక్రవారం స్థానిక బైరాగిపట్టెడ ఎం.జి.ఎం. హైస్కూల్ నందు జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం (నేషనల్ డీ వార్మింగ్ డే) లో భాగంగా పాఠశాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పిల్లలు పెద్ద చదువులు చదువుకొని మంచి స్థాయికి రావాలంటే ఆరోగ్యం చాలా అవసరం అన్నారు. 1 నుండి 19 సంవత్సరాల పిల్లలు, కిశోర బాలలకు 400 ఎం.జి. మాత్రలు, 1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర భోజనం చేసిన తరువాత మింగించాలని తెలిపారు . జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల పిల్లలు 97,481, ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు 3,05,915 మంది, ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్మీడియట్ విద్యార్థులు 72,722 మంది, బడి బయట పిల్లలు (10-19 సం) 2969 మంది మొత్తం వెరసి 4,79,087 పిల్లలు ఉన్నారని, వాళ్ళందరికీ డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రీహరి, అడిషనల్ డి.ఎం.అండ్ హెచ్.ఓ అరుణసులోచన దేవి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ పద్మావతి పాల్గొన్నారు.

## రూ.4 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

**పోలీసుల అదుపులో నలుగురు**

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**



గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి 4 లక్షల రూపాయలు విలువ చేసే 20 కేజీల గంజాయి స్వాదీనం చేసుకున్నట్లు తిరుపతి ఈస్టు డిఎస్పి సురేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక ఈస్టు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులకు అందిన సమాచారం మేరకు తిరుపతి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే అతిథిగృహం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళలు, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పోలీసుల విచారణలో వీరు విజయవాడకు చెందిన బి.రూపవతి(65), వీరంకి దుర్గ (52), బండారి కుమారి (45), తిరుపతిలో కాపురం ఉంటున్న నగరిమండలం ఓజికుప్పానికి చెందిన సత్తుపాటి లోకేశ్వరరావు (47)గా గుర్తించారు. నరసరావుపేటలో నిందితులైన ముగ్గురు మహిళలు గంజాయిని కొనుగోలు చేసి, తిరుపతిలో ఉండే నాగేశ్వరావుకు లాట్‌గా అందజేసేవారని, అతను వాటిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి, నగరి, పుత్తూరు తదితర ప్రాంతాల్లో విక్రయించి అక్రమార్జన చేస్తూ యువతను మత్తుకు బానిసలు చేస్తూ, వారి జీవితాలను నాశనం చేస్తున్నట్లు వెల్లడయిందన్నారు. ఈ కేసులో నిందితుడు గతంలో తమిళనాడులో దొంగతనం కేసులో శిక్ష అనుభవించాడని, తిరుపతిలో గుట్కా అక్రమ రవాణా కేసులో పాత నేరస్తుడని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. గత సంవత్సరం నుండి తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6 గంజాయి అక్రమ రవాణా కేసులు నమోదు చేసి 19 మంది ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 64.4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. ఈ కేసు లో ప్రతిభ కనబరిచిన తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి, ఎస్సై పురుషోత్తం రెడ్డి, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మునిరాజులు పాల్గొన్నారు.

## వైసీపీ సీనియర్ నాయకుని కలిసిన కార్యకర్తలు

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** బియస్ కండ్రిగ మండలం, నిర్వాకోట గ్రామ పంచాయతీ నుండి 20 మంది వైసీపీ కార్యకర్తలు వైసీపీ సీనియర్ నాయకులు జొన్నల గోపాల్ రెడ్డిని కలిసి వారికి ఎదురైన అన్యాయం, సమస్యలు గురించి విన్నవించుకున్నారు. పది సంవత్సరాలు పైగా పార్టీ కోసం కష్టపడినా తగిన గుర్తింపు లేదన్నారు. స్పందించిన గోపాల్ రెడ్డి మండలంలో అందరి కార్యకర్తల సమస్యలు పెద్దలతో మాట్లాడి పరిష్కరిస్తామని, 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.

## పౌష్టికాహారం పంపిణీ

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌ను శుక్రవారం వైద్యులు నిర్వహించారు. గర్భిణులకు హాస్పిటల్ సూపరింటెండెంటు షరీనా, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా ప్రతినెలా గర్భిణులకు జన విజ్ఞాన వేదిక మంచి పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమని, ఇది గర్భిణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, సెల్వి రామ్మోహన్ రావు, డాక్టర్ రాజా పాల్గొన్నారు.

**గూడూరు టౌన్ :** గూడూరు పట్టణంలోని డివిఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ అనేక పర్మినెంట్ సేవా కార్యక్రమాలు ప్రారంభించి కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కంఠి రామ్మోహన్ రావు, నాగులు, గిరి, శ్రీనివాసులు, పాదర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

## పార్లపల్లిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** మండల కేంద్రంలోని పార్లపల్లి గ్రామ పంచాయతీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష పిహెచ్‌సి డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గైనిక్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజేశ్వరి, సర్జన్ డాక్టర్ సతీష్, కంటి వైద్య నిపుణులు నారాయణస్వామి ఆధ్వర్యంలో 402 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 32 మందికి కంటి అద్దాలు అందించారు. 360 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్ణ మంజుల, సచివాలయ సిబ్బంది, నోడల్ ఆఫీసర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం: ఏఈ

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలో రేపు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బుచ్చినాయుడు కండ్రిగ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ పుణ్యకోటి శుక్రవారం తెలిపారు. 12 గంటలు అనంతరం విద్యుత్ సరఫరా యథావిధిగా సరఫరా అవుతుందని ఆయన తెలిపారు.

## వెండి కవచం విరాళం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** బహదూర్ పేట నల్లగంగమ్మ ఆలయానికి అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు వాస్తవ్యులు తోట రజని కాంత్ దంపతులు వారి తల్లి దండ్రులు తోట విజయరాం, సరోజమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని ఆలయ ఛైర్మన్ కంఠా రమేష్‌కు అందజేసి అమ్మవారి వెండి కవచం తయారీకి వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అనిల్, యాదగిరి, నారాయణ, పూజారి గుణ, మల్లి పాల్గొన్నారు.

## టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా శ్యామ్ యాదవ్

**ప్రజాశక్తి - గూడూరు రూరల్:** గూడూరు పట్టణ సమీపంలోని మిని గురుకులం నందు నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఉత్తమ క్రీడాకారులను నగదు, సర్టిఫికేట్లు అధ్యక్షులు మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మండల, డివిజన్, జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మినీ గురుకులం హెడ్ మాస్టర్ మేరీ ప్రియతి, పైడి కోటేశ్వరరావు, పంతగిరి, భాస్కర్, కరిముల్లా ఖాన్, మినీ గురుకులం పిఈటి నాగయ్య, మినీ గురుకులం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిమాండ్లు మేనిఫెస్టోలో చేర్చాలి

**దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్**

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** నేటికీ ఎస్సీ, ఎస్టీల ఆర్థిక చైతన్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత చరిత్రను, భారత రాజ్యాంగాన్ని ఆరో తరగతి నుండి డిగ్రీ వరకు పాఠ్యపుస్తకాల్లో ప్రవేశపెట్టాలన్నారు. సర్కారు బడిలో ఇంగ్లీష్ మీడియం తీసుకురావడం శుభపరిణామని, ఇంగ్లీష్ మీడియం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రజా ఆరోగ్య ఉచిత వైద్యాన్ని అందించాలన్నారు. ఇంటి స్థలాలపై ఐదు సెంట్లు 10 లక్షల వరకు మార్కెట్ విలువ కల్పించాలని కోరారు. ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చి, ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాశక్తి - బాలాయపల్లి :** మండలంలోని నిడిగల్లు, పిల్లలు, గొల్లపల్లి, కొత్త పాళెం,ఆలిమిలి,మన్నూరు,పల్లి గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను స్థానిక తహశీల్దార్ పుల్లారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 75 పోలింగ్ కేంద్రాలు ఉండడున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు ఉండేలా ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట విఆర్ఓ లు శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

**వెంకటగిరి రూరల్ :** వెంకటగిరి తహశీల్దార్ కె సాంబశివరావు శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని పెట్లూరుమెట్టగుంట పంచాయతీలోని పోలింగ్ బూత్‌లను కేంద్రాలను తనిఖీలు చేశారు. ఈ పరిశీలనలో పెట్లూరు వీఆర్వో వాసు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లోకేష్ లు ఉన్నారు.

## ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ఎస్ వి ఆర్ట్స్ కళాశాల తరఫున ఆరుగురు ఎన్సిసి క్యాడెట్లు ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొన్నారు. రాష్ట్ర చరిత్రలో రికార్డు అని, ఒక కాలేజ్ నుంచి ఆరు గురు ఎంపిక కావడం ఒక చరిత్ర అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వేణుగోపాల్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు గ్రామచంద్ర, తరుణ్ తేజ, హేమశ్రీ,చిట్టెన్ రావు, భరత్, లోహిత్ రిపబ్లిక్ పరేడ్ లో పాల్గొనడమే కాకుండా విశిష్టమైన ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కరుడు, ఎన్ సి సి అధికారులు రమేష్, ఉమా మహేశ్వర, పురుషోత్తం, అధ్యాపకులు భీమన్న, మల్లికార్జున, భాషా, కామేశ్వరరావు, కె ఎస్ నాయుడు, ముస్తాక్ అహ్మద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

## టిడిపి ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి - రామచంద్రాపురం :** నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానికి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని టిడిపి యువ నేత పులివర్తి వినీల్ కోరారు. శు క్రవారం నడవలూరు, ఐపేట కాలనీ, నడవలూరు దళితవాడలో 'మీ ఇంటి వద్దకు...మీ పులివర్తి నాని' బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, జనార్ధన్ చౌదరి, కే మధుసూదన్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, ఎద్దుల గుణమ్మ, కే నరసింహారెడ్డి, ఎల్ సుబ్బారెడ్డి నాయుడు పాల్గొన్నారు.

## ఆంగ్ల భాషా ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని న్యాయ శాస్త్ర విభాగంలో ప్రత్యేక గెస్ట్ లెక్చరర్ డా.మధురి వదనికి ఆధ్వర్యంలో న్యాయ శాస్త్ర విభాగంలో ఆంగ్ల భాష ప్రాముఖ్యతపై డా. రవి కుమార్ పై ప్రత్యేకంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాస్త్ర విభాగపు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు ఎంపిడిఓగా ఐసాక్ ప్రవీణ్

**ప్రజాశక్తి - తొట్టంబేడు:** తొట్టంబేడు మండలం నూతన ఎంపిడిఓ గా పి. ఐసాక్ ప్రవీణ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆత్మకూరు నుండి ఎన్నికల బదిలీలో భాగంగా తొట్టంబేడుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు మండల సిబ్బంది ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## నోటు పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి):** నియోజకవర్గంలోని 395 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 23,000 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీ మిథున్ రెడ్డి సోదరుడు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# నిబంధనలు నిల్!

- మురుగు కాలువల్లో డైయింగ్ ఫ్యాక్టరీల నీళ్లు
- బోర్లు, పైపులైను నీటిలో కలుషితం
- ఆస్తమా, చర్మ వ్యాధులతో ప్రజలు సతమతం
- నిద్రావస్థలో అధికారులు

**ప్రజాశక్తి- నారాయణవనం :** ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న డైయింగ్ ఫ్యాక్టరీలు నిబంధన లు మరిచి రంగు నీళ్లను స్థానిక కాలువల్లో వదులుతున్నారు. ఈ కారణంగా పరిసరాలు కలుషి తమై బోర్లు, తాగునీటి పైపు లైన్లలో రంగు నీరు కలుస్తోంది. ఆ నీటిని తాగితే చర్మవ్యాధులు వ్యాపిస్తు న్నాయని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు అరుణానదిలో రంగునీరు ప్రవహి స్తుండడంతో అందులో చేపలు మృత్యు వాతపడుతున్నాయి. ఎలాంటి నింధనలు పాటించని డైయింగ్ ఫ్యాక్టరీలపై రెవెన్యూ, కాలుష్య నియంత్రణ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి వుంది.

మండల కేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న డైయింగ్ ఫ్యాక్టరీలు ప్రజలకు హాని కలిగిస్తున్నాయి. ప్రజలు చర్మవ్యాధులతో భయాందోళనకు గురవు తున్నారు. అరుణా నదిలోని చేపలు సైతం ఈ రంగు నీళ్ల కారణంగా మృత్యువాత పడుతున్నాయి. నారాయణవనం మేజరు పంచాయతీలోనే సుమారు 15 డైయింగ్ ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. డైయింగ్ ఫ్యాక్టరీల ద్వారా విడుదలయ్యే రసాయ పదార్థాలను దర్జాగా మురికి కాలువలో వదిలేయడంతో అవి మంచి నీటి బోరులు, పైప్ లైన్లను, బోరు బావుల్లో కలుషితమై ప్రజలకు రోగాలు తెచ్చి పెడుతున్నాయి. వాస్తవానికి డైయింగ్ ఫ్యాక్టరీలను నడిపే వ్యక్తులు రెవెన్యూ పొల్యూషన్ అధికారుల అనుమతి తప్పక తీసుకోవాల్సి వుంది. ఆ తరువాత అనుమతి తీసుకున్న డైయింగ్ ఫ్యాక్టరీ నీళ్లను ఎట్టి పరిస్థితు ల్లోనూ మురికి కాలువల్లో కలపకూడదు. ఈ నీటిని నిల్వ ఉంచడానికి పెద్ద పెద్ద గుంతలను ఏర్పాటు చేసుకోవాలి. తవ్వుకున్న గుంతల్లోనే ఈ రంగు నీళ్లను వదులుకోవాలి. అయితే ఈ నిబంధన లకు విరుద్ధంగా మురికి కాలువల్లో కలవడంతో ప్రజలు అనేక రకాల రోగులకు గురి అవుతున్నారు. ఇందులో ప్రధానంగా చర్మవ్యాధులు , ఆస్తమా వ్యాధులతో ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు.

**నిద్రావస్థలో అధికారులు**

ఈ డైయింగ్ ఫ్యాక్టరీలను మూసి వెయ్యాలంటూ సుమారు ఏడేళ్ల క్రితం కమ్యూనిస్ట్ నాయకులు స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట రెండు రోజుల పాటు నిరాహార దీక్షలు చేపట్టారు. అప్పట్లో తాత్కాలికంగా డైయింగ్ ఫ్యాక్టరీలను నిలిపివేశారు. ఆ తర్వాత మళ్లీ డైయింగ్ ఫ్యాక్టరీలు మళ్లీ కొనసాగుతున్నాయి. మురుగు కాలువల్లో వదిలే రంగు నీళ్లు చివరకు అరుణానధిలో కలుస్తోంది. అరుణా నదిలోకి ఈ రంగు నీళ్లు కలవడం వల్ల నారాయణవనంతో పాటు సముదాయం, కీళగరం, బొప్పరాజుపాలెం గ్రామ సమీపంలోని బోరు బావుల్లోనూ ఈ రంగు నీళు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని పొల్యూషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా డైయింగ్ ఫ్యాక్టరీ యజమానులు ఇచ్చే నెలసరి కమీషన్లతో పట్టించుకోవడంలేదనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డైయింగ్ ఫ్యాక్టరీలపై రెవెన్యూ, కాలుష్య నియంత్రణ అధికారులు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



కలుషిత నీటికి కారణమవుతున్న డైయింగ్ ఫ్యాక్టరీల రంగునీరు

## వినతులను సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్

**ప్రజాశక్తి -తొట్టంబేడు:** 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తొట్టంబేడు మండల స్థాయి జగనన్నకు చెబుదాంకు వచ్చిన 45 వినతులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి నియోజక వర్గం లోని తొట్టంబేడు మండలం ఎస్.ఎస్ ఫంక్షన్ హాలులో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి వినతులను స్వీకరించి అక్కడే ఆన్లైన్ నమోదు చేసి పరిష్కరించడానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ముంగిటకు సుపరిపాలన అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సేవలను ప్రజలకు తెలిసేలా వారికి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి, డిఎల్డిఓ ఆదిశేషారెడ్డి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ఎంపిడిఓ, తహశీల్దారు శివరామ సుబ్బయ్య, డిప్యూటీ తహశీల్దార్ సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

## కానిస్టేబుల్ గణేష్‌కు టాస్క్ ఫోర్స్ నివాళి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** అన్నమయ్య జిల్లా కెవిపల్లి గుండ్రాల వారి పల్లె క్రాస్ వద్ద స్మగ్లర్ల ఘాతుకానికి బలైపోయిన కానిస్టేబుల్ గణేష్ (32)కు తిరుపతి నగర పరిధిలోని టాస్క్ ఫోర్స్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం టాస్క్ ఫోర్స్ ఎస్పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో వ్యక్తిగత రక్షణ కోసం వివిధ శాఖలతో రక్షణ చర్యలు తీసుకునేలా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఎంతో ధైర్యసహసాలతో విధులు నిర్వహించే టాస్క్ ఫోర్స్ సిబ్బంది మనో ధైర్యాన్ని దెబ్బకొట్టేలా వ్యవహరించి, కానిస్టేబుల్ గణేష్ మృతికి కారకులైన వారికి పడే శిక్ష నిజమైన ఘన నివాళి అవుతుందన్నారు. గణేష్ కుటుంబానికి అందవలసిన లబ్ధిని రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు విభాగం నుండి త్వరతగతిన చేరేలా కృషి చేస్తున్నామన్నారు. టాస్క్ ఫోర్సు కార్యాలయంలోని ఒక సమావేశ మందిరానికి గణేష్ పేరును పెడుతున్నామన్నారు. టాస్క్ ఫోర్స్ డిఎస్పి చెంచుబాబు మాట్లాడుతూ పోలీసులపై స్మగ్లర్లు ఎన్నడూ ఇంతటి సాహసానికి ఒడిగట్టలేదని, విధుల్లో ఉన్న సిబ్బంది తమ వ్యక్తిగత భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారుల సూచనలు సలహాలను తీసుకుంటూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దుర్ఘటన జరిగిన వెంటనే ఎస్పీ స్పందించి 30 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆర్ఐ (ఏఆర్) సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ టాస్క్ ఫోర్సు సిబ్బంది కలిసి గణేశ్ కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేస్తామన్నారు. గణేష్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సభలో టాస్క్ ఫోర్స్ రైల్వే కోడూరు, కడప సబ్ డివిజన్ నుండి సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ మురళీకృష్ణ ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



గణేష్‌కు జోహార్లు అర్పిస్తున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది

## విధులు పారదర్శకంగా నిర్వహించాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కిరణ్‌కుమార్

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** ఎన్నికల విధుల సిబ్బంది తమ విధులు పారదర్శ కంగా నిర్వహించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం కిరణ్ కుమార్ హెచ్చరించారు. నియోజక వర్గంలోని క్లస్టర్ ఆఫీసర్లు, ఎన్నికల అధికారులతో ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం కిరణ్ కుమార్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ ఆయన మాట్లాడుతూ నియోజక వర్గం లోని 294 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి గూడూ రు అర్బన్ లో 3, రూరల్ పరిధిలో 8, చిల్లకూరులో 5, కోటలో 5, వాకాడు లో 5, చిట్టమూరులో 7 చొప్పున క్లస్టర్స్‌గా విభజించామన్నారు. ఒక్కొక్క క్లస్టర్ ఆఫీసర్ కనీసం 10 నుండి 13 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించే దుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నియోజక వర్గ కేంద్రానికి దూరం గా ఉన్న మండలాల అధికారులు ఓటింగ్ సమయం లో ఎలాంటి ఒడిదిడుకులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల క్లస్టర్ ఆఫీసర్లగా నియమి తులైన సిబ్బం ది ఎన్నికల సమీక్ష సమావేశాలకు హాజరు కావడానికి ముందు తమ శాఖ ఉన్నతా ధికారులకు సమాచారం అందించి హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్పి సూర్యనారాయణరెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల విధులపై సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డివో కిరణ్‌కుమార్

## ఉపాధి పనుల సామాజిక తనిఖీ సభ

**ప్రజాశక్తి- నారాయణవనం:** నారాయణవనం మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక పనుల తనిఖీ ప్రజావేదిక సభ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ వివిధ శాఖల సిబ్బందికి రూ.53,984లు రికవరీ, పెనాల్టీ విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో ఉపాధి కూలీలకు ఎక్కువ పని దినాలు కల్పించాలని కోరారు. ఎంపీపీ దివాకర్ రెడ్డి, అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు, ఏపీడీ సరిత, ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీవో సుకన్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి పనుల సామాజిక తనిఖీ సభలో పాల్గొన్న అధికారులు

## బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** తల్లిదండ్రులు అప్పు చేసి అది తీర్చలేక అప్పుచేసిన వారి వద్ద పిల్లలను కార్మికులుగా చేరుస్తున్నారని, బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలని కార్మిక శాఖ మండల అధికారి హేమాచారి పేర్కొన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లి ఇటుక బట్టీల వద్ద రాష్ట్ర న్యాయ సేవ సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికారి సంస్థ, పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర, కార్మిక శాఖ అధికారి హేమాచారి అధ్యక్షతన శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. పిల్లలను బాల కార్మికులుగా చేయకూడదని వారిని బడిలో చేర్పించి మంచి చదువు చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఎవరైనా పిల్లలను బడికి పంపకుండా పనిలో చేర్పిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువు కునేందుకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫామ్, సామగ్రి ఇస్తున్నారని, ఎవరూ పనికి పంప కుండా బడికి పంపాలని తెలిపారు. 18 సంవత్సరాలు లోబడిన బాలలను ఇటుక బట్టీల యాజమాన్యం పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు, ఇటుక బట్టి యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక శాఖ మండల అధికారి హేమాచారి


## నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

**ప్రజాశక్తి -దొరవారిసత్రం:** దొరవారి సత్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 8 గ్రామ సచివాలయంలోని గ్రామాల్లో శుక్రవారం 3,972 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ కళాశాలలో ప్రిన్సిపాల్ పార్వతి మాత్రలు వేశారు. ఎం జె పి కళాశాలలో సిహెచ్ఓ సంపూర్ణమ్మ హెల్త్ ఎడ్యుకేషన్ చేసి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కాన్వెంట్స్, అంగన్వాడీ కేంద్రాల్లోని అర్హులైన పిల్లలు4048 ఉండగా 3972 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరువైజర్లు పిహెచ్ఎన్ పద్మావతి, హెచ్ వి మైధిలి, హెచ్ ఎస్ గోపి కిరణ్ పాల్గొన్నారు.

**బాలాయపల్లి :** మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు సిడిపిఓ సంషాద్ బేగం ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్వాడీ సూపర్ వైజర్ రాజేశ్వరి అల్బెండ్‌జోల్ మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్ తనిఖీ

**ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలోని ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహాన్ని బీసీ సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా విద్యార్థుల చదువును గురించి క్షుణ్ణంగా పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులకు మార్చిలో నిర్వహించే పరీక్షల్లో సలహాలు, సూచనలు పాటించాని క్లుప్తంగా వివరించారు. వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులు 100కి 100 శాతం ఉత్తీర్ణత సాధించి వసతి గృహ అధికారులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉన్నత చదువులకు వెళ్లాలని విద్యార్థులను కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ట్యూటర్లకు సలహాలు ఇచ్చారు అనంతరం వసతిగృహ అధికారి రామయ్యకు విద్యార్థులకు పరీక్షలు అయ్యేవరకు ఉదయం సాయంకాలం వసతి గృహంలో అందుబాటులో ఉంటూ వారికి కావలసిన వసతులు కల్పిస్తూ మంచి ఉత్తీర్ణత సాధించేందుకు వసతి గృహం అధికారి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం వంటగదికి వెళ్లి వంటను పరిశీలించి శుక్రవారం వసతి గృహంలో చికెను, గోంగూర, పెరుగు పచ్చడి, గుడ్డు కూరలను పరీక్షించి వాటి నాణ్యతను రుచి చూసి వసతి గృహ సిబ్బందిని మెచ్చుకున్నారు. పిల్లలకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలని వసతి గృహ సిబ్బందికి ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసరు చంద్రశేఖర్ వసతి గృహ అధికారి రామయ్య, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.



బిసి సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న బిసి సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌రెడ్డి

## అభివృద్ధి, సంక్షేమమే బాధ్యత: టిడిపి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** నగరి నియోజకవర్గంలోని అన్నీ మండలాలు, పట్టణాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం బాధ్యత తాను తీసుకుంటానని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ప్రజలకి భరోసా ఇచ్చారు. శుక్రవారం పుత్తూరు మున్సిపాలిటీ 23 వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ప్రభాకర్ రెడ్డి, రమేష్,బాబు నాయుడు, నాగేంద్ర, గోపి ఆచారి, మాధవ, బొల్లినేని మధు, కుమార్, ఆ పార్టీ ప్రెసిడెంట్ జీవరత్నం నాయుడు, ఎన్ఎన్‌ధనపాల్, మాధవ నాయుడు, విక్కీ, తదితరులు పాల్గొన్నారు.

## క్రైం న్యూస్

### స్వర్ణముఖిలో పడి మున్సిపల్ ఒప్పంద ఉద్యోగి మృతి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున ఉన్న రామసేతువు వద్ద స్వర్ణముఖినదిలో పడి మున్సిపల్ పారిశుద్ధ విభాగంలో పని చేసే ఒప్పంద ఉద్యోగి పి.శ్రీనివాసులు (45) మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. శ్రీనివాసులుకు మద్యం సేవించే అలవాటు ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో మద్యం సేవించి రామసేతు వద్ద గోడపై పడుకుని నిద్రించినట్లు చెప్పుకుంటున్నారు. ఈ సమయంలోనే పొరబాటున స్వర్ణముఖినదిలో పడి మృతి చెందారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసులు గురువారం రాత్రి అయినా ఇంటికి రాక పోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం వెతకగా స్వర్ణముఖినదిలో ఆయన మృతదేహం లభ్యమైంది. వన్ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

## బీజేపీతో దోస్తీ రాష్ట్రానికి పెనుముప్పు

- 16న గ్రామీణ బంద్ - సీపీఎం, ప్రజా సంఘాల పిలుపు





మాట్లాడుతున్న సిపిఎం జిల్లాకార్యదర్శి వి నాగరాజు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్లు ఆశాజనకంగా లేవనీ.. కార్మిక, కర్షక, పేదల సంక్షేమానికి కోత పెట్టేలా ఉన్నాయని సీపీఎం జిల్లా కారదర్శి వందవాసి నాగరాజు విమర్శించారు. వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మిక, కర్షక గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చపల్లి సుందరయ్య భవన్లో శుక్రవారం శ్రీకాకహస్తి, సత్యవేడు నియోజకవర్గాల సీపీఎం, ప్రజా సంఘాల ముఖ్య నేతల సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు కొమ్ముకాసేలా ఉందని మండిపడ్డారు. ఆహార సబ్సిడీలో రూ.60 వేల కోట్ల కోత, రైతులకిచ్చే ఎరువుల సబ్సిడీలో రూ.62 వేల కోట్లు, ఉపాధి హామీకి రూ.4800 కోట్లు కోత పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, వెనకబడ్డ జిల్లాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయింపులో మోడీ ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. రాష్ట్ర బడ్జెట్ కూడా నిరాశపరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని చెప్పారు. కనీసం ప్రాజెక్టులు పూర్తిపై కూడా జగన్ ప్రభుత్వం దృష్టి సారించలేదని ధ్వజమెత్తారు. జగన్ అప్పు చేసి పప్పు కూడైనా పెడతాడునుకుంటే పస్తులతో చంపుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి అన్ని విధాలా ద్రోహం చేసిన బీజేపీతో దోస్తీ కట్టేందుకు వైసీపీ, టీడీపీ, జనసేనలు వెంపర్లాటం సిగ్గుచేటన్నారు. బీజేపీతో దోస్తీ రాష్ట్రానికి పెనుముప్పనీ, ప్రజలు అలోచించి ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దేశానికి, రాష్ట్రానికి పెనుముప్పుగా మారుతున్న బీజేపీ, వాటి దోస్తే పార్టీలను ఓడించేందుకు వామపక్షాలు, లౌకిక శక్తులు ఏకమవు తున్నాయనీ, ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలకు మద్దతు తెలపాలని సూచించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, రంగయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి గంధం మణి, హరినాధ్ పాల్గొన్నారు.

## ఐఐటి పెండింగ్ పనులు పూర్తి కావాలి: కలెక్టర్

**ప్రజాశక్తి-తిరుపతి టౌన్ :** కేంద్ర విద్యా సంస్థ ఐఐటి లో పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డా.జి. లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఐఐటి కు సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ ,జెసి శుభం బన్సల్ తో కలిసి ఐఐటి డీన్ ప్లానింగ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ మురళీకృష్ణ, డిప్యూటీ రిజిస్ట్రార్ చమన్ మెహతా, ఈఈ సివిల్ చైతన్య, సంబంధిత అధికారులతో సమీక్షించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కు తాగు నీరు అంశంపై ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ వారు దష్టి పెట్టి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. వీధి దీపాలు ఏర్పాటుకు సంబంధించి అంచనాలు తయారు చేయాలన్నారు. ఆర్టీసీ వారు ఐఐటి రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ సంబంధిత సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీకాళహస్తి రవి శంకర్ రెడ్డి, ఎస్.ఈ లు ఏపీఎస్పిడిసిఎల్ కష్ణా రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ విజయ కుమార్, ఐఐటి ప్రతినిధులు, జి సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో కన్నడ హీరో దర్శన్

**ప్రజాశక్తి- శ్రీకాళహస్తి:** ప్రముఖ కన్నడ హీరో దర్శన్ శుక్రవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీ శ్వ రాలయానికి విచ్చేశారు. ఆయనకు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే ముక్కంటి తీర్థ ప్రసాదాలను, జ్ఞాపికలను, కలంకారి వస్త్రాలను అందజే శారు. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

### తొట్టంబేడు తహశీల్దార్ గా శివరామ సబ్బయ్య

**ప్రజాశక్తి -తొట్టంబేడు:** తొట్టంబేడు నూతన తహశీల్దార్ గా శివరామ సుబ్బయ్య శుక్రవారం భాద్యతలు చేపట్టారు ఈయన నెల్లూరు జిల్లా ఓజిలి మండల తహశీల్దార్ గా పని చేస్తూ ఎన్నికల బదిలీ లో బాగంగా తొట్టంబేడు కి బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కు డిప్యూటీ తహశీల్దార్ సుధీర్ రెడ్డి ఘనంగా పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.

### 'వెరిటాస్' సైనిక్ స్కూల్‌ను సందర్శించిన జెసి

**ప్రజాశక్తి -రామచంద్రాపురం:** మండలంలోని సి. రామాపురం వద్ద ఏర్పాటు చేసిన వెరిటాస్ సైనిక స్కూలును తిరుపతి జేసీ శుభం బన్సల్ సందర్శించారు. శుక్రవారం వెరిటాస్ సైనిక స్కూల్ కు ప్రభుత్వ అనుమతుల కోసం జాయింట్ కలెక్టర్,కలికిరి సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ తో కూడిన ప్రత్యేక టీం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ పాల్గొన్నారు.